ప్రజాశక్తి

శుక్రవారం 3 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అలవాలంలో కాల్పుల కలకలం

- పల్నాడులో మళ్లీ ఫ్యాక్షన్ పడగ
- అనధికారికంగా తుపాకీల వినియోగం



అలవాలం ఘటనలో నిందితులు ఉపయోగించని తుపాకీని చూపుతున్న పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు ప్రాంతంలో ఫ్యాక్షన్ మరోసారి పడగ విప్పింది. ఫ్యాక్షన్ నేపథ్యంలో తుపాకి కాల్పుల ఘటన రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో బుధవారం రాత్రి కలకలం రేపింది. టిడిపికి చెందిన రొంపిచర్ల మాజీ ఎంపిపి బాలకోటిరెడ్డిపై అతని సమీప బంధువు కాల్పులు జరపడం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. గత రెండేళ్ల కాలంలో పల్నాడు జిల్లాలో ఐదుగురు టిడిపి నేతలు హత్యకు గురయ్యారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో చంద్రయ్య, దుర్గిలో జల్లయ్య, దాచేపల్లి మండలం పెదగార్లపాడులో పురంశెట్టి పెద అంకులు, గురజాల ప్రాంతంలో విక్రమ్, నర్సరావుపేట ప్రాంతంలో సైదా అనే టిడిపి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు హత్యకు గురయ్యారు. రాజకీయ కక్షల నేపథ్యంలో వైసిపి నాయకులు తమ పార్టీ కార్యకర్తలను హతమార్చినట్టు టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే వీటిని వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్యలుగా పోలీసు అధికారులు చెబుతున్నారు. తాజాగా పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అలవాలకు చెందిన టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి వెన్నా బాలకోటిరెడ్డిపై బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో తుపాకీతో కాల్పులు జరిపారు. రాజకీయ ఆధిపత్యం కోసం బాలకోటిరెడ్డిపై కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. బాలకోటిరెడ్డి ఎన్ని వత్తిడిలు వచ్చినా తెలుగుదేశంలో కొనసాగుతున్నారు. ఆయనపై గతంలోనూ ఒకసారి దాడి జరిగింది. ఈ ఘటనలో ఆలవాల గ్రామానికి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి, పూజల రాములు, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన పులి అంజిరెడ్డి, ఫిరంగిపురం మండలం నుదురుపాడుకు చెందిన వంటిపులి వెంకటేశ్వర్లును పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో రాజస్థాన్ నుండి తీసుకువచ్చిన తుపాకిని నిందితులు వినియోగించినట్టు పల్నాడు జిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి ప్రకటించారు. అయితే గతంలో దాడి చేసిన పమ్మి వెంకటేశ్వరరెడ్డికి స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆశ్రయించి ఇచ్చి హత్యకు పురిగొల్పారని టిడిపి సీనియర్ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు తదితరులు ఆరోపించారు. ఈ ఘటనతో తమకు సంబంధం లేదని టిడిపిలో గ్రూపుల ఘర్షణలు కాల్పుల ఘటనకు దారితీసాయని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. బాలకోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి మామా అల్లుళ్లు అని ఆయన గుర్తు చేశారు. అయితే గతంలో వెంకటేశ్వరరెడ్డి తన మామ బాలకోటిరెడ్డి పై దాడి చేసిన 2లో



తాడికొండ అడ్డరోడ్డు వద్ద బడ్జెట్ ప్రతుల దహనంలో మాట్లాడుతున్న కె.అజయ్‌కుమార్

వ్యవసాయాన్ని దెబ్బతీసే బడ్జెట్

బడ్జెట్ ప్రతులను దహనం చేసి రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి - తాడికొండ, తాడేపల్లి, తాడేపల్లి రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్నా శివశంకర్‌రావు, కంచుమాటి అజయ్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు తాడికొండలోని బస్టాండ్ సెంటర్లో, బోసుబొమ్మ సెంటర్‌లో, రూరల్ పరిధిలోని కుంచనపల్లి నటరాజ కళామందిరం వద్ద గురువారం నిరసన చేపట్టారు. తాడికొండలో బడ్జెట్ ప్రతులను దహనం చేయగా తాడేపల్లిలో ప్రజాసంఘాల కార్యాలయం నుండి బోసుబొమ్మ వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70 శాతం ప్రజానీకం వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, కోవిడ్ కాలంలో దేశ ప్రజలకు ఆహారం అందించింది వ్యవసాయ రంగమే అని చెప్పారు. అదే కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను కూడా నిలబెట్టిందీ వ్యవసాయ రంగమేనని గుర్తు చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పు పిఎం కిసాన్ తీసుకొచ్చి పథకానికి ఈ బడ్జెట్లో నిధులు తగ్గించడం, ఎరువుల సబ్సిడీలకు నిధులు తగ్గించడం, వరదలకు, 2లో

కలుషిత ఆహారం ఘటనపై విచారణ

జిజిహెచ్, సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు న్యాయసేవాధికార సంస్థ పరామర్శ



జిజిహెచ్‌లో విద్యార్థినులను పరామర్శిస్తున్న న్యాయమూర్తి రత్నకుమార్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

పల్నాడు జిల్లా సత్తెనపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని, విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘనటపై రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కలపాల రత్నకుమార్ విచారణ చేపట్టారు. గురువారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన తీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై వైద్యులను, విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్యం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని, పూర్తిగా నయం అయిన తర్వాతే డిశ్చార్జి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని ఆదేశించారు. అనంతరం సత్తెనపల్లిలోని గురుకుల పాఠశాలకు వెళ్లి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని విచారించారు. అక్కడున్న ఆర్‌ఒ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి వెంట న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్‌ఎంఒ డాక్టర్ సతీష్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది కృష్ణవేణి, మీనాక్షి తదితరులున్నారు.

నకిలీ బంగారంతో రూ.20 లక్షల రుణం 8లో

అలవాలంలో కాల్పుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

కేసులో నిందితుడుగా ఉన్నా పోలీసులు అతని కదలికలపై నిఘా పెట్టలేకపోయారు. దీంతో అతను ఈసారి ఏకంగా తుపాకితో కాల్చిచంపాలని ప్రయత్నించాడు. ఈ ఘటనలో పోలీసుల నిఘా వైఫల్యం కూడా ఉందనే విమర్శలు వస్తున్నాయి.

విస్తరిస్తున్న గన్ కల్చర్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు గ్రామాల్లో గన్ కల్చర్ విస్తరిస్తోంది. జిల్లాలో అధికారికంగా లైసెన్సు పొందిన వారు దాదాపు 300 మంది ఉండగా అనధికారికంగా కొంత మంది గన్‌లు వినియోగిస్తున్నారని తెలిసింది. మాచర్ల మండలం రాయవరం గ్రామంలో 2021 ఆగస్టు 29న భూ వివాదంలో ఆర్మీ ఉద్యోగి మట్టా సాంబశివరావు తమ సమీప బంధువులు నల్గురిపై కాల్పులు జరపగా ముగ్గురు చనిపోయారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఆర్మీ ఉద్యోగం మానివేసిన తరువాత కూడా గన్ కలిగి ఉండటంతో అతనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే గన్ లైసెన్సులు లేకుండా కొంత మంది అనధికారికంగా తుపాకులు వినియోగిస్తున్న ఘటనలు అడపాదడపా వెలుగుచూస్తున్నాయి. అదేకోవలో రొంపిచర్ల మండలం ఆలవాల గ్రామంలో వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి రాజస్థాన్ నుంచి తుపాకి తెచ్చి బాలకోటిరెడ్డిపై కాల్పులు జరిపాడు. దాచేపల్లి మండలంలో ఇటీవల తుపాకి స్వాధీనం ఘటనలు వెలుగు చూశాయి.



బంగారు పతకం సాధించిన రాష్ట్ర జట్టు, ఇన్‌సెట్‌లో కప్పుతో కెప్టెన్ రామృష్ణ

కెప్టెన్ రామకృష్ణకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - దుగ్గిరాల

హర్యానాలోని సోనిపట్‌లో ఇటీవల నిర్వహించిన వాలీబాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించగా ఈ జట్టుకు మండలంలోని ఈమనికి చెందిన రామిశెట్టి రామకృష్ణ నాయకత్వం వహించారు. యూత్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పేరుతో నిర్వహించిన ఈ పోటీల్లో రామకృష్ణ పాల్గొని జట్టుకు బంగారు పతకం రావడంలో కీలకపాత్ర పోషించినందుకు దుగ్గిరాల కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.గిరిధరరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, సిబ్బంది అభినందించారు. రామకృష్ణ ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో దుగ్గిరాలకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ వారు సహాయ సహకారాలు అందించారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ, ఈఓఆర్‌డి, సిబ్బంది

మండల పరిషత్‌లో కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యలయంలో గురువారం గ్రామ వార్డ్, సచివాలయ ఎంప్లాయిస్ అసోయేషన్ ఆంధ్ర ప్రదేశ్ నూతన కేలండర్‌ను ఎంపిడిఒ శ్రీ రమ్య, ఈఓఆర్‌డి మావులూరి మోషే లు అవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీ రమ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సచివాలయలు ద్వార ప్రభుత్వంలో బాగమై సేవలు చేస్తున్నా ఉద్యోగులు ప్రజలకు మరింత సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూ ఎస్ ఎ ఏపి గుంటూరు జిల్లా ప్రసిడెంట్ టీ. రాజేష్, సచివాలయ సిబ్బంది గోపి శామ్యూల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకునిపై నాటు తుపాకీతో కాల్పులు

- నలుగుర్ని అరెస్టు చేసి ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు
- దాడిపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి పరస్పర ఆరోపణలు



బాలకోటిరెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నాయకుల,ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో

ప్రజాశక్తి - రొంపిచర్ల, నరసరావుపేట

రాజకీయ ఆధిపత్యం పోరు నేపథ్యంలో టిడిపికి చెందిన మాజీ ఎంపిపిపై నాటు తుపాకీతో కాల్పులకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అలవాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అలవాలకు చెందిన టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి వెన్నా బాలకోటిరెడ్డి ఇంటికి బుధవారం రాత్రి 10.30 దాటిన తర్వాత కొందరు వచ్చి తలుపు తట్టారు. తలుపు తీసిన కోటిరెడ్డిపై నాటు తుపాకీతో కాల్పులు జరపడంతో ఆయన అక్కడే కుప్పకూలిపోయాడు. ఇది తెలిసిన స్థానిక టిడిపి నాయకులు ఆయన్ను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం స్థానికంగానే మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని సమాచారం. బాలకోటిరెడ్డిపై కొద్ది నెలల కిందటే దాడి జరిగిందని, ఆయనకు రక్షణ కల్పించడంతోపాటు కాల్పులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కె.రామారావు, బి.నాగేశ్వరరావు, పి.అంజిరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరాజు డిమాండ్ చేశారు.

టిడిపి నాయకుల పనే : ఎస్పీ

ఇదిలా ఉండగా దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జిల్లా పోలీస్‌కార్యాలయంలో గురువారం వివరాలను వెల్లడించారు. ఆధిపత్య పోరులో భాగంగా గ్రామానికి చెందిన ఆయన బంధువులు, టిడిపివారే ఈ దాడికి పాల్పడ్డారని చెప్పారు. గ్రామానికి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి, పూజల రాములు, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన పులి అంజిరెడ్డి, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం నుదురుపాడుకు చెందిన వంటిపులి వెంకటేశ్వర్లును అరెస్టు చేశామన్నారు. బాలకోటిరెడ్డికి ప్రధాన నిందితుడైన వెంకటేశ్వరరెడ్డి సమీప బంధువన్నారు. పార్టీలో ప్రముఖస్థానం ఇప్పిస్తామని చెప్పి గత పంచాయతీ ఎన్నికల సమయంలో, తిరునాళ్ల సందర్భాల్లో వెంకటేశ్వరరెడ్డితో డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయించారని, అయినా ఆయన్ను నిర్లక్ష్యం చేస్తుండడంతో బాలకోటిరెడ్డిని హత్యకు వెంకటేశ్వరరెడ్డి పథకం పన్నారని తెలిపారు. ఇందులో భాగంగా గతేడాది జులై 19న హత్యకు ప్రయత్నించారని, ఆ కేసులో జైలుకు వెళ్లిన ఆయనకు జైలులో అంజిరెడ్డి పరిచయం అయ్యాడని, వీరు జైలు నుండి వచ్చాక ప్రస్తుతం మరోసారి హత్యాయత్నం చేశారని తెలిపారు. నిందితులు రాజస్థాన్ నుండి తెప్పించి వాడిన నాటు తుపాకిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బాలనాగిరెడ్డి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, గ్రామంలోనూ అవాంఛనీయ ఘటనలకు వీల్లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన రూరల్ సిఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబును ఎస్పీ అభినందించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.బిందుమాధవ్, డీఎస్పీ విజయభాస్కర్‌రావు, నరసరావుపేట రూరల్ ఎస్ఐ బలనాగిరెడ్డి, హాజరత్తయ్య పాల్గొన్నారు.

హత్యకు వైసిపి ప్రోత్సాహం : టిడిపి

మరోవైపు హత్యాయత్నం వైసిపి కుట్రని టిడిపి నాయకులు ఆరోపించారు. కాల్పులకు గురైన బాలకోటిరెడ్డిని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఇతర నాయకులు పరామర్శించారు. బాలకోటిరెడ్డిపై ఇది రెండో దాడి అని, గతంలో దాడి చేసిన పమ్మి వెంకటేశ్వరరెడ్డికి స్థానిక ఎమ్మెల్యే ఆశ్రయించి ఇచ్చి ఈసారికూడా రెచ్చగొట్టి హత్యకు పురిగొల్పారని ఆరోపించారు. ఇందుకు తమ వద్ద ఆధారాలూ ఉన్నాయన్నారు. బాలకోటిరెడ్డి ఆరోగ్యంపై టిడిపి అధినేత చంద్రబాబు ఆరాతీశారు. అరవిందబాబు, వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు.

మాకు సంబంధం లేదు : ఎమ్మెల్యే

కాల్పుల ఘటనపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పందించారు. దీనితో తమ పార్టీకి సంబంధమేమీ లేదని, బాలకోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి మామా అల్లుళ్ల అవుతారని అన్నారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణలే చేశారని విమర్శించారు. తమది గన్ సంస్కృతిని కాదని, గతంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు బాంబుల సంస్కృతి ఉండేదని, ఆయన సత్తెనపల్లి వెళ్లాక నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని అన్నారు. తాజా ఘటన టిడిపి సొంత విషయమని, వారి మధ్య కొన్నేళ్లుగా వివాదాలు జరుగుతూనే ఉన్నా సఖ్యత కుదర్చడంలో ఆ పార్టీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. ఆ పార్టీ అంతర్గత వివాదాలను వైసిపికి అంటగట్టాలని చూడడం అన్యాయమని, వాస్తవాలు తెలుసుకోకుండా అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వ్యవసాయాన్ని దెబ్బతీసే బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

తుపానులకు, విపత్కర పరిస్థితిలో పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఇవ్వవలసిన క్రాప్ ఇన్సూరెన్స్ కూడా నిధులు తగ్గించడం, వ్యవసాయ కార్మికులకు, రైతులకు, కౌలు రైతులకు పనులు కల్పించే ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించడం దారుణమన్నారు. వ్యవసాయ రంగం పై ఆధారపడే సాగు రైతులను, వ్యవసాయ కూలీలను వ్యవసాయ రంగం నుండి దూరమయ్యే పరిస్థితి తీసుకొచ్చి, కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయ రంగాన్ని అప్పజెప్పడానికే నిధుల్లో కోతపెట్టారని దుయ్యబట్టారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న సహకార రంగాలను కేంద్ర పరిధిలోకి తీసుకెళ్లి తర్వాత కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే కుట్ర జరుగుతోందన్నారు. దేశంలో 8.5 లక్షల సహకారం రంగాలు ఉంటే వీటి కింద 18.5 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయి. వీటిని కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే యత్నం జరుగుతోందని అన్నారు. మద్దతు ధర చట్టం కోసం అనేక ఉద్యమాలు చేస్తున్నా ఈ అంశాన్ని పరిగణలో తీసుకోలేదని విమర్శించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకులు జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి అడుగడుగునా కేంద్రం మోసం చేసున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. విభజన హామీలు అటకెక్కించడంతో పాటు విశాఖ ఉక్కును ప్రైవేట్ పరంగా చేయడాన్ని విరమించుకోవాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలను ఇస్తామని చెప్పి మద్దతు ధర ఇవ్వకుండా రైతులను మోసం చేశారని, దేశ ప్రధానికి రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కార్యక్రమాల్లో నాయకులు, రైతులు కె.పూర్ణచంద్రరావు, సిహెచ్.భాస్కరరావు, నరసింహారావు, సత్యనారాయణ, రాజు, జానీ అప్పిరెడ్డి, శివారెడ్డి, చంటి, శ్రీను, భాస్కర్, నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.కరుణాకర్‌రావు, ఇ.రామారావు, జి.శీనివాసరావు, సిహెచ్‌శ్రీరామ్, ఎమ్‌డి బాబ్జి, టి.బక్కిరెడ్డి, కె.వెంకటయ్య, ఎస్ కె బాషా, టి.నాగేశ్వరరావు, జి. అంజిరెడ్డి, డి.వెంకటరెడ్డి, ఎ.రంగారావు, ఎ.సాంబశివరావు, జి.శంకర్రావు, ఎ.సంజీవరెడ్డి, పాల్గొన్నారు.



తాడేపల్లిలో నిరసన తెలుపుతున్న రైతు సంఘ నాయకులు

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూలు వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుకు సమీపంలోని లాం ఢిల్లీ పబ్లిక్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవం గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మూర్తి ఫ్యాషన్స్ అధినేత జి. నారాయణమూర్తి, హిందూ కాలేజ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక, బోధనలో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఈ పాఠశాల మెరుగైన ఫలితాలను సాధిస్తుందన్నారు. ప్రిన్సిపల్ ఉషారాణి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి జరుగుతుందన్నారు. అలాగే పాఠశాల ప్రో వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో ప్లస్ వన్ రాబోతుందని అందుకు కావాల్సిన అన్ని అనుమతులు త్వరలో వస్తాయన్నారు. పాఠశాల డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, చుక్కపల్లి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఆహూతులను అలరించాయి.



కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులకు సన్మానం



ప్రజాశక్తి-తాడేపల్లి: ఇటీవల కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్‌లో జరిగిన ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అత్యధిక ప్రతిభ కనబరిచి 13 బంగారు పతకాలను సాధించిన చిన్నారులకు సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. సుందరయ్యనగర్ బత్తులరాజు భవనల్ నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డిని కూడా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్‌రావు, సిపిఎం నాయకులు ఎస్.వెంకట్రావు, వేణుగోపాలస్వామిరెడ్డి, పి.గిరిజ, కె.ఉషారాణి, పి.రామచందర్‌రావు, ఎస్‌కె బాషా తదితరులు పాల్గొన్నారు. సుందరయ్య నగర్‌కు మంచి పేరు తెచ్చిన కోచ్ సంఘవిని సిపిఎం బృందం జ్ఞాపికతో సత్కరించారు.

విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య

ప్రజాశక్తి-గుంటూరు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈఈఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన విద్యార్థి పీ.పోతురాజుకు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు వర్సిటీ వీసీ కార్యాలయం గురువారం తెలియజేసింది. " డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎంబెడెడ్ చాపర్ విత్ బైడైరెక్షనల్ డ్యూయల్ పోర్ట్ డీసీ–ఏసీ కన్వర్టర్ ఫర్‌వైడ్ వోల్టేజ్ రేంజ్ అప్లికేషన్స్" అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని వెల్లడించింది. పోతురాజుకు వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోపిదేవి సుబ్బారావు గైడ్‌గా వ్యవహరించారు. పోతురాజుకు విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావురత్తయ్య అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

శ్రీకష్ణ ఆశ్రమానికి తులసి ధర్మచరణ్ ఆర్థిక సాయం



ప్రజాశక్తి-గుంటూరు: పల్నాడు జిల్లా మోర్జంపాడులోని శ్రీకష్ణ ఆచల సిద్ధాంత ఆశ్రమం అభివృద్ధికి రూ.50,116ల ఆర్థిక సాయాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అందచేశారు. గురువారం స్థానిక అరండల్ పేట 11/3లోని వేద సీడ్స్ ప్రధాన కార్యాలయంలో ధర్మచరణ్ ఆశ్రమ నిర్వాహకుడు ఎం.రామానుజా సూరితో సమావేశమై ఆశ్రమం చేపడుతున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ 2001లో ఈ ఆశ్రమాన్ని ఆచల సిద్ధాంత గురువు మధురాంతకం వెంకట నర్సయ్య స్వామిజీ నిర్మించి, నిర్విరామంగా ప్రజలకు సేవ చేశారన్నారు. వారి తదనంతరం ఆశ్రమ అభివృద్ధికి ఆయన కుమారుడు రామానుజా సూరి కృషి చేస్తున్నారని ధర్మచరణ్ అభినందించారు. కార్యక్రమంలో యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ ఢీ - యువకుడు మృతి

- మరొకరి పరిస్థితి విషమం - ఇద్దరూ ఇంజనీరింగ్ విద్యార్థులు
- నిశ్చితార్థానికి కేకు తీసుకొస్తుండగా ప్రమాదం
- పేరేచర్ల-సత్తెనపల్లి రోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద ఘటన

ప్రజాశక్తి - మేడికొండూరు

వాళ్లిద్దరూ వరుసకు బావాబావమరిది మాత్రమే కాదు చిన్నప్పటి నుండి మంచి స్నేహితులు కూడా. ఇద్దరూ ఇంజనీరింగ్ విద్య చదువుతున్నారు. కొన్ని గంటలలో జరగనున్న తమ బంధువుల అమ్మాయి నిశ్చితార్థ వేడుకకు అవసరమైన కేకును తీసుకొచ్చేందుకని ఇద్దరూ కలిసి బైకుపై వెళ్లి ఘోర రోడ్డుప్రమాదం బారిన పడ్డారు. మృత్యువు టిప్పర్ లారీ రూపంలో వచ్చింది. ఈ హృదయవిదారక ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

ఈ ప్రమాద సంఘటన మేడి కొండూరు మండలంలోని పేరేచర్ల , సత్తెన పల్లి రోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద గురువారం ఉదయం పదకొండున్నర గంటల సమయంలో జరిగింది. మేడి కొండూరు మండలంలోని పట్లపాడుకు చెందిన పి. వినయ్, చేబ్రోలు ఇంజనీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువు తున్నాడు. అతని మేనత్త కొడుకు సత్తెనపల్లికి చెందిన జెట్టి శివ బద్రినాథ్ మేడికొండూరు వద్ద ఉన్న ఎన్నారై టి ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్నాడు. వీళ్లిద్దరికీ దగ్గర బంధువైన అమ్మాయికి పొట్లపాడులో జరగాల్సిన నిశ్చితార్థం కార్యక్రమం వద్ద సంతోషంగా గడుపుతున్నారు. కొన్ని గంటల్లో జరగాల్సిన ఈ వేడుక కోసం కేక్ తెప్పించాలనుకున్న పెద్దలు, ఆ పని నిమిత్తం వీరిద్దరిని పేరేచర్లకు పంపారు. సంతోషంతో ద్విచక్రవాహనంపై బయలుదేరిన వారి వాహనాన్ని మార్గ మధ్యంలో కాలువ వంతెన వద్ద మట్టిలోడు లారీ వేగంగా వస్తూ బలంగా ఢీ కొట్టింది. ఎలాంటి ముందస్తు సిగ్నల్ వేయ కుండానే ఉన్నపళంగా కుడి కాలువ కట్టవైపు టిప్పర్‌ను డ్రైవర్ తిప్పాడు. వేగ నియంత్రణ కోల్పో యిన లారీ బలంగా ఢీకొట్టడంతో దాని వెనుక చక్రాల కింద ద్విచక్ర వాహన పడి పోయింది. కిందపడిపోయిన వినయ్ (20) పొట్టపైకి లారీ ఎక్కి కొంత దూరం వరకు అతన్ని ఈడ్చుకు వెళ్ళింది. దీంతో అతని శరీరం రెండు భాగాలుగా వేరైన ఈ దారుణ ఘటనలో అతను దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడ్డ శివ బద్రీ నాథ్‌కు అధిక రక్తస్రావం జరిగి కొన ఊపి రితో కొట్టు మిటాడుతున్నాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న మేడికొండూరు సిఐ అల్తాఫ్ హుస్సేన్, క్షతగాత్రుని ఆటోలో, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదే రోడ్డు మార్గాన మేడికొండూరుకు వెళుతున్న మేడికొండూరు తహశీల్దార్ జి.కరుణకుమార్ ప్రమాద సంఘటనను పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సంఘటనపై మేడ కొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న వారి బంధుమిత్రులు సం ఘటనా స్థలానికి చేరుకుని విలపించడం పలువురిని కలచివేసింది. 'ఉన్నత చదు వులు చదివి మంచి స్థాయికి ఎదిగి కుటుం బానికి అండగా ఉంటావనే ఆశను ఆవిరి చేశావా' అంటూ మృతుడి కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు అక్కడి వారిని కండతడి పెట్టించింది.



ఘటనా స్థలిలోనే మృతి చెందిన వినయ్



తీవ్ర గాయాలతో శివ బద్రీనాథ్



హైస్కూల్ విద్యార్థులకు కిట్స్ ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగం వారు గురువారం వట్టిచెరుకూరు మండలం, అనంతవరపాడులోని జెడ్పీ హైస్కూల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, ఇన్నోవేషన్ కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగేంద్రం, ఆవిష్కార్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, స్టూడెంట్ కోఆర్డినేటర్ పుంగలాలి, రాధిక, బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హింసించిన భర్తపై కేసు

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రేమించి పెళ్లి చేసుకొని ఇద్దరు ఆడ పిల్లలు కలిగిన తరువాత భార్యను మానసికంగా, శారీ రకంగా హింసిస్తున్న భర్త పై భార్య ఫిర్యాదు చేయ డంతో పోలీసులు అరెస్టు చేసి అతన్ని రిమాండ్ కు తరలించారు. చేబ్రోలు ఎస్ ఐ కె ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం, చేబ్రోలు గ్రామానికి చెందిన కొలగాని ఫణీంద్ర ,అదే గ్రామానికి చెందిన మాధవి 2008 వ సంవత్సరంలో ప్రేమ పెళ్ళి చేసు కున్నారు. వీరికి ఇద్దరూ ఆడపిల్లలు .పెళ్లి అయిన కొంత కాలానికి భార్యను మానసికంగా, శారీ రకంగా హింసిస్తుండేవాడు. వారిద్దరి మధ్య మన స్పర్థలు పెరిగిపోవడంతో కొంత కాలం క్రితం మాధవి తన పుట్టింటికి వెళ్లిపోయింది.దీంతో భార్య పై కోపం పెంచుకున్న ఫణీంద్ర, 23.01. 2023 వ తేదీ అర్ధరాత్రి సమయంలో భార్య పుట్టింటి వద్ద పార్క్ చేసి ఉన్న మాధవి స్కూటీపై పెట్రోలు పోసి నిప్పంటించి తగులబెట్టాడు. ఈ సంఘటన చూసిన వాళ్ళు మాధవికి చెప్పారు. ఆ మరుసటి రోజు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిం ది.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలి పారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో చేబ్రోలులోని విఘ్నేశ్వర సినిమా థియేటర్ వద్ద నిందితుడు ఫణీంద్రను అరెస్ట్ చేశామనానరు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 91,580
మిర్చి ఎగుమతి	: 89,522
మిర్చి నిల్వ	: 73,444

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,000 - 22,000
నెం.5	10,000- 20,000
273	9,000 - 17,500
341	8,000 - 22,000
4884	13,000 - 15,500
సూపర్ 10	16,200 - 17,700
నాన్ ఎసి	
తేజ	7,000 - 19,500
బడిగి	11,500 - 25,000
దేవనూరు డీలక్స్	11,000- 22,000
తాలుకాయలు	4,000 - 12,000

సమగ్రశిక్ష అడి షనల్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.విజయలక్ష్మిని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల జిల్లా మేనేజర్ వి.వజ్రబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో జిల్లాలో పాఠ్యపుస్తకాలను సకాలంలో సరఫరా చేసే విషయంలో పూర్తి సహకారం అందిస్తామని ఏపీసి తెలిపారు.



నూతన ఏపిసికి బొకే అందచేస్తున్న వజ్రబాబు

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి -ఫిరంగిపురం: మండలంలోని మునగపాడులో అభివృద్ధి పనులపై గురువారం స్థానిక ఎంపిపి షేక్ షహేలానర్గీస్ సలీం సమీక్షిం చారు. రూ. 12 లక్షల వ్యయంతో గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ నుంచి 120 మీటర్ల వరకు నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతా ప్రమాణాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ నూర్జహాన్ , ఉప సర్పంచ్ సాకే వెంకటరత్నమ్మ , వైకాపా నాయకులు షేక్ సుభాని, మాజీ ఎంపీటీసీ సత్తార్ జిలాని మొహిద్దిన్ మాబు పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో ప్రజా జీవనం అస్తవ్యస్తం'

ప్రజాశక్తి-మంగళగిరి: వైసీపీ పాలనలో పేద ప్రజల ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని రాష్ట్ర టిడిపి మహిళా కార్య నిర్వహణ కార్యదర్శి వింజమూరు ఆశా బాల అన్నారు. గురువారం రాత్రి మంగళగిరి లోని టిట్కో గహ సము దాయం వద్ద ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం జరిగింది.

దొంగ పై పిడుగు

నిధుల దుర్వినియోగంపై చీటింగ్ కేసు

ప్రజాశక్తి - చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటిలో సీనియర్ ట్రాన్స్ పోర్ట్ ఇన్‌ఛార్జిగా పని చేసిన ఉద్యోగిపై నిధులు దుర్వినియోగంపై విషయమై చర్యలు చేపట్టాలని కోరుతూ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. చేబ్రోలు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం, కోయల్ ఇండియాలో పని చేసి రిటైర్డ్ అయిన ఎ.వి. నరసింహారావును చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటిలో సీనియర్ ట్రాన్స్ పోర్ట్ ఇన్‌ఛార్జిగా 2020వ సంవత్సరంలో నియమించారు. నరసింహారావు 19.11. 2020 నుండి 18.10. 2022 వరకు యూనివర్సిటీ లో సీనియర్ ట్రాన్స్ పోర్ట్ ఇన్‌ఛాచార్జి గా పని చేశాడు. అయితే నర సింహారావు పనిచేసిన కాలంలో ఈ యూనివర్సిటి నిధులను దుర్వినియోగం చేశాడనే అనుమానం యాజమాన్యానికి కలిగింది. ఈ నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ నిమిత్తం డిసిప్లినరీ కమిటీని నియమిం చారు. యూనివర్సిటీ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ ఆఫీసర్ ఎన్ . రామారావు జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, దీనికి పూర్తి బాధ్యుడు నరసింహారావు అని నిర్ధారించారు. నరసింహారావు దుర్వినియోగ చేసిన డబ్బులు మొత్తం రూ.2,62,930 తిరిగి ఇవ్వమని యాజమాన్యం కోరింది. ఈ క్రమంలో నరసింహారావు తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ విజ్ఞాన్ రామారావు చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందెం శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి-నకరికల్లు: కోడి పందెం శిబిరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం చీమలమర్రి నుండి చాగల్లు వెళ్లే డొంక రోడ్డులో కోడి పందేలు నిర్వహిస్తున్నరనే సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురు వ్యక్తులను, 2 పందెం కోళ్లను, రూ.2,560 నగదును స్వాదీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి

- మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ శివశంకర్ సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతితో కలిసి మోడల్ స్కూల్‌లు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ లో పరీక్షల అనంతరం వేసవి సెలవుల్లో బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. బాలికలు తమ సమస్యల పరిష్కారానికి వారిలో వారు చర్చించుకుని తల్లి దండ్రులు లేదా ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చేలా చేసి, సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని అన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలను నిరోధించేందుకు గ్రామ కమిటీలను బలోపేతం చేస్తూ గ్రామ సచివాలయంలో ఉన్న మహిళా పోలీసుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. యుక్తవయసు మహిళల్లో వచ్చే సమస్యలను సావధానంగా అర్థం చేసుకొని సానుకూల దక్పథంతో పరిష్కరించాలని చెప్పారు. పదవ తరగతి పరీక్షల అనంతరం పాస్ అయిన వాళ్లందరికీ ఇంటర్మీడియట్‌లో సీట్లు ఉన్నాయా అనేది పరిశీలించాలని అన్నారు. పది పాస్ అయిన తదుపరి ఆర్థిక స్తోమత, ఇంటి పరిస్థితుల దృష్ట్యా పై చదువులకు వెళ్లలేని పిల్లలను గుర్తించి వారికి పైచదువులకు అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని, తదనగుణంగా డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించాలని సూచించారు. గురుకుల, మోడల్ పాఠశాలలలో భవన పరిస్థితులను, విద్యుత్ సంబంధిత కనెక్షన్ల పరిస్థితులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పొలాల మధ్య ఉన్న పాఠశాలల్లో పాములు, చీడలు రాకుండా జాగ్రత్త వహించాలని , చుట్టుపక్కల గుబురుగా చెట్లు ఉండకుండా చూడాలని, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉంచేలా చూడాలన్నారు. గురుకుల, మోడల్ హైస్కూళ్ల పరిధిలో తాగునీటి వసతికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బకాయి పడ్డ విద్యుత్ బిల్లుల విషయంలో తగు నివేదికను అందజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. పద్మావతి మాట్లాడుతూ అసాధారణంగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి మానసిక వైద్యులతో చికిత్స చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె బాలల హక్కుల పరిరక్షణ కు సంబంధించి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఐసిడిఎస్ పిడి అరుణ, జిసిడిఒ రేవతి, సిడిపిఒ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహాశీల్దార్ విజయ జ్యోతి కుమారి

రైతులు అందుబాటులో లేక రీ-సర్వేకు ఆటంకాలు

ప్రజాశక్తి-ఈపూరు

భూ రీ సర్వే జరిగే గ్రామాల్లో కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో సర్వే ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని తహాశీల్దార్ సిహెచ్ విజయజ్యోతికుమారి అన్నారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలోని కొండముట్ల, కొండాయపాలెం,ఈపూరు,గుండేపల్లి, చిట్టాపురం,బొమ్మరాజుపల్లిలలో భూముల రీ సర్వే జరుగుతోందన్నారు. కొండాయ పాలెం, కొండ్రముట్లకు చెందిన రైతులు దూర ప్రాంతాల్లో ఉండి రీ సర్వేకు హాజరు కాక పోవడం వలన రీ సర్వే పనులు నిలిచిపోతున్నాయని చెప్పారు. వారం రోజులవ్యవధిలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాల్సి ఉందని భూపట్టాదారులందరూ రెవెన్యూ అధికారులకు సహకరించి రీ సర్వే చేయించుకోవాలని కోరారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీరాజ్యం

ప్రజాశక్తి-విజయపురిసౌత్



స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా ఎం.లక్ష్మీరాజ్యం గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు పాఠశాల ప్రిన్సిపాల్ గా ఉన్న దేవరకొండ బాలకృష్ణ జనవరి 31వ తేదీన పదవీ విరమణ చేయడంతో ఇదే పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్ గా లక్ష్మీరాజ్యం విధులు నిర్వహించారు. ఇప్పుడు ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.



జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మాదల విద్యార్థులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఇటీవల తాడేపల్లిగూడెంలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14 గర్ల్స్ స్టేట్ మీట్ టోర్నమెంట్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు రెండో స్థానం సాధించింది. ఇందులో మాదల జెడ్పిహెచ్ఎస్ ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.శ్రావ్య జాతీయ జట్టులో స్థానం సంపాదించింది. అదేవిధంగా, కడప జిల్లా ఎర్రగుంట లో జరిగిన అండర్-17 బాయ్స్ అండ్ గర్ల్స్ పుట్ బాల్ స్టేట్ మీట్ టోర్నమెంట్‌లో ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు గరికపాటి ప్రదీప్,గుడిగుంట్ల దివ్య ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ పెద్దలు, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మినుములో చిరు సంచులతో అధిక లాభాలు

ప్రజాశక్తి - ఈపూరు

చిరు సంచులను ప్రయోగాత్మకంగా సాగు చేయడం ద్వారా కొత్త రకాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అధిక లాభాలను సాధించవచ్చని ఏరువాక కేంద్రం (ఎంటమోలజి) శాస్త్రవేత్త డాక్టర్ ఎం నగేష్ అన్నారు. మండలంలోని కొచ్చర్ల లో రైతులు గోలి అంకారావు,గోలి రత్తయ్య సాగుచేసిన ఎల్బీజి 932, ఎల్బీజీ 7 52 చిరు సంచుల రకాల మినుము పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ రకం మినుము పైరు పల్లాకు తెగులు,బూడిద తెగులును తట్టుకుంటాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలకు అవసరమైన సమయంలో తగు సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. అనంతరం మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు సీనియర్ శాస్త్రవేత్త సిహెచ్ శ్రీలత వాణి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ జి.కిషోర్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.రామారావు, సచివాలయ వ్యవసాయ సహాయకులు కిషోర్ రైతులు ఉన్నారు.


మినుము పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఎం. నగేష్


యడ్లపాడులో మిరప పైర్లను పరిశీలిస్తున్న టిడిపి రైతు స్టీరింగ్ కమిటి

దెబ్బతిన్న మిర్చి పొలాల్లో టిడిపి పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడులో నష్టపోయిన మిరప రైతులను టిడిపి రైతు స్టీరింగ్ కమిటీ సభ్యులు, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మిరప కళ్లాలను, నల్లిపురుగు కారణంగా పాడైన పంట పొలాలను పరిశీలించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా డ్వామా పిడి జోసఫ్ కుమార్ హెచ్చరించారు. సత్తెనపల్లి ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధి హామీ పనులపై గురువారం ప్రజావేదిక నిర్వహించారు. సత్తెనపల్లి మండలంలో 2020 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు 23 కోట్ల 43లక్షల 90 వేలు 857 రూపాయలు మేర ఉపాధి హామీ పనులు జరిగాయని, వివిధ గ్రామాల్లో జరిగిన ఈ పనులపై సోషల్ ఆడిట్ ఆపై ప్రజా వేదిక నిర్వహించారు. వివిధ గ్రామాల్లో జరిగిన పనుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. 39,018 వేలు సంబంధిత సిబ్బంది నుండి రికవరీ చేయాలని ఆదేశించారు. ఫణిదం ,పెదమక్కెన,గుడిపూడి గ్రామాల్లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు 50 శాతం ఎండిపోవడంతో కొత్తవి నాటాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎపిడి కె.రఘుకుమార్ , అంబుడ్స్‌మన్ బాబురావు, ఎంపిడిఒ జీవి సత్య నారాయణ, ఎస్ఆర్‌పి అప్పలనాయుడు ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.


సత్తెనపల్లి ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రజావేదిక



ఎరువులు అందుబాటులో

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జానపాడు, తుమ్మల చెరువులలోని రైతు భరోసా కేంద్రాలను పిడుగురాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు బి. శ్రీకృష్ణదేవరాయలు, పిడుగురాళ్ల మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసు కోవాలని అన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వరి పొలాలను వారు సందర్శిం చారు. పొలాన్ని పరిశీలించి జింకు లోపం ఉన్నట్లు రైతులకు చెప్పారు. జింకు లోప నివారణకు జింక్ సల్ఫేట్(చిలామిన్ జింక్ 12 శాతం) ఒక లీటరు నీటికి రెండు గ్రాములు వారం వ్యవధిలో రెండుసార్లు పైపాటుగా పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే, పొలంలోనే పంట నమోదు ఎలా జరుగుతుందో పరిశీలించారు. జానపాడు, తుమ్మలచేరువు గ్రామ వ్యవసాయ సహాయకులు చౌదర్ రెడ్డి, మే, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా లేని బడ్జెట్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో పేద ప్రజలకు భరోసా లేదని, కోట్లాది మంది పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. గుంటూరుకు గురువారం వచ్చిన ఆయన స్థానిక సిపిఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సంపన్న వర్గాలకు పెద్దపీట వేసే బడ్జెట్ అన్నారు. రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలకు చర్యలు లేకపోవడం విచారకరమని అన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎంపీలు గళమెత్తాలని, సొంత పనులకు పరిమితమైతే చరిత్ర హీనులవుతారని హెచ్చరించారు. ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ నీటి మూటగానే మారిందని, బడ్జెట్‌లో ధరల నియంత్రణకు చర్యలు లేవని, పైగా ఉన్న పథకాల్లో కోతలు విధించారని విమర్శించారు. ఆయనవెంట సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కె.మాల్యాద్రి, జి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వ్యవసాయంలో సంక్షోభాన్ని నిలువరించలేని కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - తెనాలి

వ్యవసాయంలో సంక్షోభాన్ని నివారించే విధంగా కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు లేవని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల రుణమాఫీకి రూ. 11 లక్షల కోట్లను మంజూరు చేయగలిగిందని, రైతుల సంక్షేమం కోసం నాలుగు లక్షల కోట్లను కేటాయించలేక పోవటం దుర్మార్గమన్నారు. సమావేశంలో ముద్దన సాంబశివరావు, తాడిపోయిన వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి పాల్గొన్నారు.

ఏ వర్గానికి మేలు చేయని బడ్జెట్

ప్రజాశక్తి - కొల్లిపర

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏవర్గానికి న్యాయం జరగేలా లేదని, అందుకు నిదర్శనం రాష్ట్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విధనాలలేని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు గురువారం మండలంలోని పిడపర్రు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అలపాటి మాట్లాడుతూ నాలుగు ఏళ్లలో పోలవరం నిర్మాణానికి ఒక్క రూపాయి కేటాయించకపోవడం దురదష్టకరమన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భీమవరపు చిన్న కోటిరెడ్డి వంగా సాంబిరెడ్డి, ఆళ్ల వీరారెడ్డి, కంచర్ల అమృత రా, జి. గోవర్ధన్ రెడ్డి, కొల్లి కోటిరెడ్డి , పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మైనార్టీలకు ఒరిగేదేమి లేదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


మీడియాతో మాట్లాడుతున్న కె.రామకృష్ణ



మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ పేదలకు ఒరింగిదేమీ లేదని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఎండి కలీమ్ అన్నారు. మొత్తం రూ. 45.03 లక్షల కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం 20 శాతం ఉన్న మైనార్టీ వర్గాలకు కేవలం రూ.3,097 కోట్లు కేటాయించడం మైనార్టీల పట్ల మోడీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతుందని తెలిపారు. జాతీయస్థాయిలో 29 రాష్ట్రాల్లో 8 కేంద్ర పాలిత ప్రాంతలలో ఉన్న మైనార్టీలకు ఒక రాష్ట్రం మైనార్టీలకు కేటాయించే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం మైనారిటీలకు కేటాయించడం లేదన్నారు


కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న నాయకులు

ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

బుడంపాడు రోడ్డులోని ర్యాలీస్ లిమిటెడ్ గూడెం, సిఅండ్ఆఫ్ కంపెనీలో ఎగుమతి ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం గూడెం ఇన్‌ఛార్జికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నగర ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు రోజువారీ బేటా ఇవ్వాలని కోరారు. రాత్రి 11, 12 గంటల వరకూ పనిచేయించటం సరికాదని, 8 గంటలు దాటిన తర్వాత పనిచేయించకూడదని అన్నారు. ఒప్పందం ప్రకారం కూలి ఇవ్వాలన్నారు. కంపెనీ ప్రతినిధులు తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ముఠా యూనియన్ నాయకులు గంగయ్య, ముఠామేస్త్రీ డి. సుబ్బయ్య, బాబు, కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి వృధాను అరికట్టాలి-సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు:నెహ్రూ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద మంచినీటి పైపులైను లీకై గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున నీరు డ్రైనేజిలో కలిసి వృధా అవుతుందని, తక్షణమే మరమ్మతులు చేపట్టి త్రాగునీటి వృధాను అరికట్టాలని సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు ఆయన గురువారం సమస్యను స్థానిక జిఎంసి ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయర్ వద్దే నీరు వృధాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవటం సరికాదన్నారు. ఏఈ స్పందిస్తూ పది రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని చెప్పినట్లు శ్రీనివాసరావు తెలిపారు.


రేటింగ్ సర్టిఫికెట్‌తో కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

ఆన్‌లైన్ కోర్సుల్లో ఆర్‌విఆర్ అండ్ జెసికి జాతీయ ర్యాంకులు

ప్రజాశక్తి-గుంటూరు

మద్రాస్‌లోని ఎన్‌పిటిఈఎల్, ఐఐటి నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో తమ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు వరుసగా మూడోసారి జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించడం గర్వకారణమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్‌పిటిఈఎల్ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో 9వ ర్యాంకు సాధించారన్నారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌లను ఇటీవల మద్రాస్ ఐఐటిలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు అందుకున్నట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. విద్యార్థులకు మంచి ప్యాకేజీతో కూడిన ఉద్యోగ అవకాశాలకు , ఉజ్వల భవిషత్తుకు ఎన్‌పిటిఈఎల్ కోర్సులు దోహదం చేస్తాయని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్‌పిటిఈఎల్ పరీక్షలకు తమ విద్యార్థులు 2928 మంది రిజిస్టర్ కాగా అందులో 82 మంది గోల్డ్ సర్టిఫికెట్స్‌ను, 843 మంది ఎలైట్ సర్టిఫికెట్స్‌ను, 603 మంది సిల్వర్ సర్టిఫికెట్స్‌ను 91 మంది టాపర్ సర్టిఫికెట్‌లను పొందారని వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఎన్‌పిటిఇఎల్ లోకల్ చాప్టర్ సమన్వయ కర్త, డాక్టర్ ఎమ్.వి.పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

నిధుల విడుదల కోసం సర్పంచ్‌ల ప్రదర్శన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

పంచాతీయలకు కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు, కాకుమాను మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు గురువారం గుంటూరులో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక హిందూ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. వీరికి అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ కార్యదర్శి డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రూ.వెయ్యి కోట్లు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో నిబంధనలకు తూట్లు

- విద్యార్థులను ఒత్తిడికి గురిచేసేలా తరగతులు నిర్వహణ
- చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి -మంగళగిరి

పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్లో అధిక గంటలు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడి గురి చేస్తున్నారని ఆ స్కూలుపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారికి ఎంఈఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి మున్న మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలైన సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అధిక గంటలు తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు తీవ్ర ఒత్తిడి, వేదనకు గురి చేస్తుందని అన్నారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివలన విద్యార్థులు శారీరక, మానసిక ఉత్సాహాన్ని కోల్పోయి అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని రాత్రి 9 గంటలకు ఇంటికి వెళ్లిన విద్యార్థి స్నానం చేసి తిని, హోం వర్క్ చేసి పడుకునేసరికి 11 గంటలు అవుతుందని విద్యార్థి ఆడుకునే అవకాశం లేదని తెలిపారు. సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అష్రఫ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


సంధ్యాకోల్‌ను అభినందిస్తున్న వీసి. రాజశేఖర్, తదితరులు

వర్సిటీ అధ్యాపకురాలికి అంతర్జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్యా కోల్‌కు అంతర్జాతీయ శాస్త్రవేత్తల పురస్కారాల విభాగంలో ఉమెన్ రీసెర్చ్ పురస్కారం సంస్థ అందించింది. ఈ సందర్భంగా ఆమెను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసీ పీ రాజశేఖర్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో వర్సిటీకి ఎన్నో అవార్డులు రావాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాకు చెందిన అంతర్జాతీయ సైన్స్ జర్నల్‌లో ఎడిటోరియల్ మెంబర్గా సంధ్యకోల్‌ను నియమించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఆచార్య ఆర్‌విఎస్ ఎస్ఎన్ . రవికుమార్, ఆచార్య నాగరాజు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహజసిద్ధ మందులకే ఆదరణ

ఎఎన్‌యులో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో "అడ్వాన్సస్ ఇన్ ఫైటోమెడిసిన్ అండ్ ఫైటోనానోకంపోజిట్స్" అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముగింపు సభకు విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్, ఆచార్య ఆవుల ప్రమీలరాణి అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆచార్య బి.కరుణ ప్రసంగిస్తూ రోగాలను తగ్గించడానికి పూర్వీకులు ఉపయోగించిన మూలికా వైద్యం నేడు సాంకేతికంగా నిర్ధారించబడుతుందని అన్నారు. వైద్యులు మందులతో వైద్యం చేస్తే ఆ మందులను తయారు చేసేవారు ఫార్మసిస్టులు అని అన్నారు. కరోనా కారణంగా మొక్కల నుండి సేకరించే సహజసిద్ధ మందులు వాడకం పెరిగిందన్నారు. ఆచార్య ప్రమీలరాణి మాట్లాడుతూ సంప్రదాయ వైద్యం ప్రాముఖ్యత పెరిగిందని దీనిపై పరిశోధనలు కొనసాగించాలని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కంబైన్డ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఇన్ ఫార్మసీ మరియు చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూర్యదేవర విద్యాధర ప్రసంగిస్తూ రోగాలను తగ్గించడానికి కొత్త కొత్త అల్లోపతి మందులు ఎన్ని వచ్చినా సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉండి శక్తివంతంగా పనిచేసే ఆయుర్వేదిక్ మందులల ఆవశ్యకత పెరిగిందని అన్నారు. రోగనిరోధకతకు యాంటీబయోటిక్స్ ఉపయోగించడానికి బదులుగా సహజ సిద్ధంగా లభించే యాంటీబయోటిక్ లక్షణం కలిగిన నూనెలను వాడడం మంచిది అని అన్నారు.కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్.డి.రవిశంకర్ రెడ్డి, డాక్టర్.యు. అన్నపూర్ణ, డాక్టర్ .పి.రోహిణి, తదితరులు పాల్గొన్నారు. ముగింపు సభలో సైంటిఫిక్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.


ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఎరువులు ఎక్కువ ధరకు అమ్మితే ఫిర్యాదు చేయండి

- హెచ్చరించిన వ్యవసాయ శాఖాధికారులు
- నరసరావుపేట, మాచర్లలో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు
- రికార్డులు, గిడ్డంగుల పరిశీలన

ప్రజాశక్తి-నరసరావుపేట

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖాధికారి వి.నరేంద్రబాబు హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలలో గురువారం ఆకస్మిక తని ఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలకు సంబంధించి రికార్డులు, గిడ్డంగులను పరిశీలించారు. ఎరువుల లైసెన్స్ లో నమోదు కానీ ఫార్మ్ 'ఓ' లకు సంబంధించి అనుమతి పత్రాలు లేని రూ. 2.78 లక్షల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. మండలంలోని రైతులకు అవసరమయ్యే అన్ని రకాల ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో, ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఎరువుల డీలర్లు ఎరువులను ఎమ్మార్పీ ధరల కన్నా మించి అమ్మితే కనుక నరసరావుపేట మండల వ్యవసాయ అధికారి, 8331056942 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



నరసరావుపేటలో..



మాచర్లలో..

అన్నిరకాల ఎరువులు అందుబాటులో

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు ఎం.ఆర్.పి ధరలకే అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ ఎడిఎ వి జగదీశ్వరరెడ్డి, తహశీల్దార్ రమేష్‌కుమార్, ఎఓ కె లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో రెవిన్యూ, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో అధికారుల బృందం సంయుక్తంగా పలు ఎరువులు, పురుగు మందుల షాపులను తనిఖీలు జరిపారు. వారు మాట్లా డుతూ మాచర్ల ప్రాంతంలో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోనూ యూరియ అందుబాటులో ఉందన్నారు. మిరప పైరులో వచ్చే తామరపురుగు నివా రణకు వినియోగించే గ్రేసియా, ఏకోష్నస్ తదితర పురుగు మందులను ఎంఆర్‌పి ధరలకే అందుబాటులో ఉన్నటు చెప్పారు. ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో ఇబ్బందులు ఎదు రైతే తమని కలిస్తే న్యాయం చేస్తామని చెప్పారు.



ఉపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి-అమరావతి

పని సర్దుబాటులో భాగంగా తాత్కాలిక పద్ధతిపై మండల పరిషత్ ప్రాథమిక (బి.సి)పాఠశాలలో నియమితులైన ఉపాధ్యాయులు కోడూరు కోటేశ్వరరావుకి విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలవాలు కప్పి సన్మానించారు. అభినందనలు తెలిపారు. బి.సి పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయిని ప్రమోషన్ పై ఉన్నత పాఠశాలకు వెళ్లడంతో కొరత కారణంగా విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా మండల విద్యాశాఖాధికారి మేడా శ్రీనివాసరావు నిర్వహించిన వర్క్ అడ్జస్ట్మెంట్ కౌన్సిలింగ్‌లో కోటేశ్వరరావు ఈ పాఠశాలను కోరుకున్నారు. ఉపాధ్యాయురాలు ఎం.డి.గౌషియసుల్తాన, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి హత్యారాజకీయాలకు తెరలేపింది

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రశాంత పల్నాడులో వైసిపి అలజడులు సృష్టించి హత్యా రాజకీయాలకు తెరలేపిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు ఎద్దేవా చేశారు. రొంపిచర్ల మండల టిడిపి అధ్యక్షుడు వెన్నా బాల కోటిరెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కనుసన్నల్లోనే కాల్పులు జరిగాయని ఆరోపించారు. వైసిపిని ప్రశ్నించినవారిని వరుసగా అంతమొందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని బయటకు పిలిచి హత్యకు యత్నించడం పైశాచికత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు దిగజారుతున్న శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, వైసిపి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.



ఆర్థికసాయం అందుకుంటున్న మృతుడి కుటుంబసభ్యులు

మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-మాచర్ల

పేదలకు వైఎస్ఆర్ బీమా ఎంతో అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక 10వ వార్డులో మృతి చెందిన జంధ్యాల ఆంజనేయులు కుటుంబసభ్యుల నివాసానికి ముస్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబుతో కలిసి వెళ్ళిన రఘురామిరెడ్డి రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్‌లు మాట్లాడుతూ పేదలు మరణిస్తే ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా పథకంతో ఆర్థికంగా అదుకుంటుందన్నారు. త్వరలో పూర్తి బీమా మొత్తం లబ్ధిదారు బ్యాంకు ఖాతాకు నేరుగా జమ కానున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ యర్రకుల సిద్దమ్మ, సిద్దయ్య, బుట్టి శ్యామల జ్యోతి, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలం మాదకద్రవ్యాలకు,మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితం గడపాలనీ సెబ్ స్పెషల్ ఎన్ పోర్స్ మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సెబ్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు,మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను దృష్టిలో పెట్టుకొని వాటికి దూరంగా ఉండాలని, చదువుపై ధ్యాస పెట్టాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. మాదకద్రవ్యాలు,మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం





మాట్లాడుతున్న సెబ్ స్పెషల్ ఎన్ పోర్స్ మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి

వలన ఆరోగ్యకరమైన జీవితంతో పాటు సమాజంలో మంచి క్రమశిక్షణతో కూడిన మంచి వ్యక్తిత్వాన్ని పొందవచ్చున్నారు. యువత మద్యపానం,ధూమపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. పల్నాడు జిల్లాలో సుమారు 56 కాలేజీలను గుర్తించి విద్యార్థులను చైతన్య పరుస్తూ ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెబ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ టి.తులసి, పాఠశాల ఉపాధ్యాయులు అనితారాణి,సదానంద బాబు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అమరా వెంకటేశ్వరరావు భార్య, కుటుంబసభ్యులు

ఆత్మహత్యపై విచారణ చేయించండి

కలెక్టర్‌కు అమరా వెంకటేశ్వరరావు భార్య వినతి

ప్రజాశక్తి-నరసరావుపేట

అమరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ అమరా వెంకటేశ్వరరావు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. దీనిపై పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని అమరా వెంకటేశ్వరరావు భార్య అరుణ తన కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ శివ శంకర్ కు గురువారం ఫిర్యాదు చేశారు. తమకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. , ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆమె కలెక్టర్‌ను కలిశారు. తమ కుటుంబానికి అండగా ఉన్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు యరమల రామచంద్రారెడ్డి

రాష్ట్రానికి నిధులు రాబట్టలేని ముఖ్యమంత్రి'

ప్రజాశక్తి-మాచర్ల

ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అవసరమైన నిధులను రాబట్టలేక పోయారని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఖరి వలన రాష్ట్రానికి తీవ్ర ఆన్యాయం జరిగిందన్నారు. కేంద్రాన్ని ముఖ్యమంత్రి గట్టిగా నిలదీయలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. పోలవరానికి నిధులు, రైల్వే జోన్, రాజధాని నిర్మాణం, రైతు రుణాల మాఫీ, ఉపాధి హమీ నిధులు, వరికపూడిశెల ఇలా ఆయా పథకాలకు నిధులు సాధించి రాష్ట్రానికి న్యాయం చేయాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్య మన్నారు. సమావేశంలో నాయకులు జివి సత్యనారాయణ, షకీర్ ఆలీ, నాగరాజు, షేక్ బాబు పాల్గొన్నారు.



టిడిపి నుంచి వైసిపిలోకి

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక 10వ వార్డు వాసు లు తెలుగుదేశం పార్టీని వీడి గురువారం వైసిపిలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామ క్రిష్ణారెడ్డి వారిని వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల వీరు ఆకర్షితులై వైసిపిలో చేరినట్లు తెలిపారు. ప్రతి కార్యకర్తకు తమ పార్టీ అండగా ఉంటుంద న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘు రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

తాగు నీటి పథకాలకు రేపు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బుగ్గువాగు మంచినీటి పథకం పనులకు ఈ నెల 4వ తేదీన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా మాచర్ల పట్టణానికి ఆయన రానున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి తెలిపారు. రూ 80.52 కోట్లతో చేపట్టనున్న మంచినీటి పథకం పైపు లైన్ల ఏర్పాటు, 12.5 ఎంఎల్‌డి రక్షిత మంచినీటి ప్లాంట్ పైలాన్ ఆవిష్కరణ, ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని చెప్పారు. 4వ తేదీ ఉదయం జరిగే కార్యక్రమంలో మంత్రితో పాటు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నేటికీ ఉపయోగమేలా..!

- మందుబాబులకు అడ్డాగా మారుతున్న కాంప్లెక్స్‌లు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



నిరుపయోగంగా ఉన్న కాంప్లెక్స్‌లు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం పక్కన గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు నేటికి ఉపయోగంలో లేకుండా నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో మందుబాబులకు అవి నిలయాలుగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే దుస్థితి నెలకొంది. నగరంలో ఈ దుకాణాలను 2013లో నిర్మించారు. అయితే పాత దుకాణం దారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సమస్య పరిష్కారం కాలేదు. కోర్టు కేసు పరిష్కారం అయ్యేలా చూస్తామని నగరపాలక సంస్థ అధికారులు తరచూ ప్రకటిస్తున్నారు. అయినా ఇప్పటి వరకు పరిష్కారం కాకపోవడంతో ఈ దుకాణాల వద్ద బార్ షాపు వాతావరణం తలపిస్తుంది. అనేక సందర్భాల్లో పోలీసులు వచ్చి బహిరంగంగా మద్యం సేవించే వారిని అదుపులోకి తీసుకున్నప్పటికీ మందుబాబులు లెక్కచేయడం లేదు. నగరపాలక సంస్థ కార్యాలయం, సమీపంలోని గ్యాస్ కంపెనీలలో పని చేసే మహిళా ఉద్యోగులతో పాటు పార్క్ రోడ్డు వైపు రాకపోకలు సాగించే ఆ ప్రాంత మహిళలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు దృష్టి పెట్టి దుకాణాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.

175వ రోజుకు అన్న క్యాంటీన్ నిర్వహణ

ప్రజాశక్తి -తెనాలి

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌లను నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక మార్కెట్ కూడలిలో గెయిటి థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ నిర్వహణ గురువారం నాటికి 175వ రోజుకి చేరింది. నన్నపనేని చినసుబ్బారావు ఐదవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు గురువారం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆలపాటి మాట్లాడుతూ పట్టణంలో రెండు అన్న క్యాంటీన్లను పార్టీ ఆధ్వర్యంలో దాతల సాయంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ శేషగిరిరావు, రావి సుష్మ, జి. భాస్కరరావు, టీ నాగప్రసాద్ , ఎం. కోటేశ్వరరావు, కౌన్సిలర్ బి. అరుణ, పాల్గొన్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి



బాలామృతంలో విలువైన పోషకాలు

ప్రజాశక్తి -తెనాలి రూరల్

బాలామృతంలో ఎంతో విలువైన పోషకాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఓ గీతాంజలి చెప్పారు. గురువారం రూరల్ గ్రామం కొలకలూరు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలామృతం పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడేళ్ల వయసులోపు పిల్లలకు రెండున్నర కేజీల చొప్పున బాలామృతం పంపిణీ అందజేస్తున్నట్లు తెలిపారు. బాలామృతంలో కాల్షియం, ఐరన్, విటమిన్ బివన్‌తో పాటు పలు రకాల పోషకాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఓ యు విజయశ్రీ , సెక్టార్-1 సూపర్‌వైజర్ ఎం సుచిత్ర, కార్యకర్త యామిని, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని లంబాడీపేట, ఆర్ఎంఎస్ కాలనీ, ముగ్గురోడ్డు, సలాం హోటల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సిఐ శేషగిరి, ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘికకార్యకలాపాల గురించి ఆరా తీశారు. చిన్న చిన్న చోరీలు, ఇతర నేరాలు జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. నిర్భయంగా తమతో అన్ని విషయాలు పంచుకోవచ్చని, ఫ్రెండ్లీ పోలీస్‌కు తాము సిద్ధంగా ఉన్నామంటూ తమ సెల్‌ఫోన్ నెంబర్లను స్థానికులకు అందజేసి సమాచారమివ్వాలని కోరారు. మద్యం సేవించి గొడవలకు పాల్పడినా, చుట్టుపక్కలవారికి ఇబ్బంది కలిగించినా నిరభ్యంతరంగా తమతో చెప్పాలని, బాధితులకు తగు న్యాయం చేస్తామని చెప్పారు.



నేడు 200 చెక్కబల్ల బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు శుక్రవారం 200 చెక్క బల్ల బండ్లను పంపిణీ చేయనున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ ఇసునూరి అనిల్ చక్రవర్తి తెలిపారు. నగరంలోని ఐబీఎన్ భవన్, ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని నిడమర్రు రోడ్డులో గల మహాలక్ష్మి గార్డెన్స్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో రోటరీ ఫోకస్ ఏరియా ఎకనమిక్ అండ్ కమ్యూనిటీ డెవలప్ మెంట్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద వీధి వ్యాపారులకు కూరగాయలు, పండ్లు విక్రయం కొరకు చేయూత చక్రాలు పేరుతో సుమారు రూ.22.80 లక్షల విలువైన చెక్క బల్ల బండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రోటరీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు శేఖర్ మెహతాతో పాటు రోటరీ ఇంటర్నేషనల్, రోటరీ నేషనల్, రోటరీ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు టి. సతీష్, కోశాధికారి జి. శ్రీనివాసరావు, ఎన్.వెంకటేశ్వరరావు, నిరంజన్ గుప్తా, మీడియా కో-ఆర్డినేటర్ ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాతూరి నాగభూషణం

నేడు పెదవడ్లపూడి సాయి మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్: మండల పరిధిలోని పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవ మహోత్సవం ఏర్పాట్లను ఘనంగా చేపట్టినట్లు జెడ్పీ మాజీ ఛైర్మన్, ఆలయ కమిటీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం గురువారం తెలిపారు. గురువారం సాయంత్రం వార్షికోత్సవ ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ పాతూరి నాగభూషణం పరిశీలించి వార్షికోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. సినీ సంగీత గాయనీ, గాయకులచే సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ షో కళాకారులచే హాస్యవల్లరితో పాటు డూప్ స్టార్స్, మిమిక్రీ, మ్యాజిక్ షో కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుండి యాత్రికులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.యాత్రికులకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా ఎక్కడికక్కడ పటిష్టమైన ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. పి. శ్రీనివాసరావు, వి. శ్రీనివాసరావు, అమ్మయ్య చౌదరి, ఆలయకార్యనిర్వహణాధికారి జె. సుబ్బారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి: స్థానిక 16వ వార్డులో టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికారప్రతినిధి డి. సుందరయాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలపై భారాలు, చెత్తపన్నులు, ఇంటిపన్నుల పెరుగుదల, కార్మికులకు పనులు లేకపోవడం వంటి విషయాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కెటివి ప్రసాద్, కొండ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణతో పాటు సామాజిక సేవ



రక్తదానం చేస్తున్న కార్మికులు పరిశీలిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి-తెనాలి: విధి నిర్వహణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కుమార్ పంప్స్ బృందం ముందుంటుందని కుమార్ పంప్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ కుమార్ పంప్స్ ఆవరణలో కుమార్ పంప్స్ అండ్ మోటార్స్, సుబ్రం వాటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి డాక్టర్ కె.శిరీష, స్రవంతి, బాపనయ్య, బిసిటివి సిబ్బంది రక్త సేకరణ చేశారు. అధినేత సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు దాదాపు 80 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన కార్మికులను సుబ్రహ్మణ్యంతోపాటు, మాజమాన్య బృందం కొత్త హరికుమార్, కొత్త కృష్ణకుమార్, కొత్త శేషుకుమార్, కొత్త శ్రీనివాసరావు అభినందించారు. అలాగే ఈనెల 5న కుమార్ పంప్స్ ఆవరణలో శంకర్ నేత్రాలయ బృందం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

క్లారినెట్ కళాకారుడు కోటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఏడాది పాటు నిర్వహించతలపెట్టిన ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో గురువారం ఎన్టీఆర్ నటించిన తల్లిప్రేమ చిత్రాన్ని ప్రదర్శించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ప్రతిరోజూ ఓ కళాకారుడిని సత్కరిస్తున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన సీనియర్ కళాకారుడు, క్లారినెట్ విధ్వాంసుడు చింతలపూడి కోటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కె.బాలకోటేవ్వరరావు, టి.రాజారావు, సిహెచ్ మల్లిఖార్జునరావు, కేసన కోటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, అయినాల మల్లేశ్వరరావు, ఎం.రాఘవరావు, జి.ప్రసాద్, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉప్పలపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్ఓ ఎస్ పద్మశ్రీ

అంగన్‌వాడీ, రేషన్ షాపుల్లో డిఎస్ఓ తనిఖీ

ప్రజాశక్తి-పెదనందిపాడు: మండలంలోని ఉప్పలపాడులో మండల పరిషత్ పాఠశాల అంగన్వాడీ కేంద్రాన్ని, 23వ నెంబర్ రేషన్ షాపును, ఎండియు ఆపరేటర్ ఉప్పలపాడు వెహికల్‌ను గురువారం జిల్లా సివిల్ సప్లై అధికారిని ఎస్ పద్మశ్రీ తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో బియ్యం, నూనె, కందిపప్పులను పరిశీలించారు. రేషన్ షాపులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, మాధవి, విశ్రాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి వారి ఆదేశాల మేరకు ఈ నెల 11న పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సత్య కుమారి పేర్కొన్నారు. పొన్నూరు కోర్టుల ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడతగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు, ఫ్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ప్రత్యక్షముగా హాజరు కావచ్చని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నంబర్: 9492662537 లేదా మెయిల్ ఐడి: pnr-misc@yahoo.com ను సంప్రదించాలని కోరారు.



మెడికల్ అసోసియేషన్ సెక్రెటరీగా కృష్ణమోహన్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : పొన్నూరు పట్టణములో మెడికల్ అసోసియేషన్ సెక్రెటరీగా లింగమల్లు కృష్ణ మోహన్ 79 ఓట్లకు 49 ఓటింగ్ మేజారిటితో విజయం సాధించారు. వారికి మద్ది పద్మజ, గుంటూరు జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం మాజీ అధ్యక్షురాలు పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ మద్ది సాయికుమార్‌లు సన్మానంచేసి శుభాకాంక్షలు తెలియజేశారు

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కుదింపుపై

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం


ప్రజాశక్తి - నరసరావుపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గోపాలరావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. వ్యవసాయ రంగానికి గతేడాది కంటే రూ.28 వేల కోట్ల కేటాయింపులు తగ్గించారని, కరోనా సమయంలో అన్ని వ్యవస్థలు అతలాకుతలమైనా వ్యవసాయ రంగం మాత్రమే దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడిందని గుర్తు చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని గతంలో ప్రకటించిన ప్రధాని మోడీ రానురాను వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టడానికి, తద్వారా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి పూనుకున్నారని పేర్కొన్నారు. పిఎం కిసాన్ పథకానికి, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు రాయితీలను, బీమాకు నిధులు తగ్గించారని తెలిపారు. పోలవరానికి నిధులు కేటాయించలేదని, పల్నాడుకు జీవనాడి అయిన వరికపూడిసెలకు అటవీ అనుమతులపైనా ప్రస్తావన లేదని, పంటల సేకరణ, మద్దతు ధరలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ అంశాలపై నరసరావుపేటలో కోటప్పకొండ రోడ్డులో ఉన్న పల్నాడు విజ్ఞాన కేంద్రంలో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహిస్తామని, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, వ్యవసాయ రంగ శ్రేయోభిలాషులు పాల్గొనాలని కోరారు.

నకిలీ బంగారంతో రూ.20 లక్షల రుణం

- రెంటపాళ్ల యూనియన్ బ్యాంకులో అప్రైజర్ అవినీతి
- బంగారం మాయంపై కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



నకిలీ బంగారంతో రూ.20 లక్షల రుణాన్ని అప్రైజరే కాజేశాడనే విషయం బంగారం మాయం కేసులో వెలుగు చూసింది. మండలంలోని రెంటపాళ్ల యూనియన్ బ్యాంకులో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారం మాయమైన విషయం తెలిసిందే. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులు, పోలీసులు కొద్దిరోజులుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఖాతాదారులు ఎంత బంగారం పెట్టారు? ఎంత రుణం తీసుకున్నారు? బంగారంపై రుణాల కోసం వచ్చిన దరఖాస్తుల ప్రకారం బంగారం ఉందా? అనే విషయాలను పరిశీలిస్తున్నారు. 49 మంది రైతులకు సంబంధించిన 3.5 కిలోల బంగారాన్ని బ్రాంచి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, అప్రైజర్ కుమ్మక్కై ఈ బంగారాన్ని మాయం చేశారని గతంలోనే అధికారులు గుర్తించగా తాజాగా అప్రైజర్ అవినీతినీ గుర్తించారు. నకిలీ బంగారాన్ని పెట్టి రూ.20 లక్షల వరకూ రుణాన్ని అప్రైజర్ సంపత్‌కుమార్ తన కుటుంబ సభ్యుల పేరుతో కాజేశాడని గుర్తించారు. అప్రైజర్‌తోపాటు అతని కుటుంబీకులపైనా మరో కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా నిందితులను పోలీసులు ఇంకా అరెస్టు చేయలేదని, విచారణలోనూ గట్టిగా వ్యవహరించడం లేదని ఖాతాదార్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కారణాల వల్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వారం రోజులుగా నిలిచిన లావాదేవీలు

మండలంలోని రెంటపాళ్ల యూనియన్ బ్యాంకులో వారం రోజులుగా సేవలు నిలిచాయి. బ్యాంకులో బంగారం మాయమైన వ్యవహారంపై విచారణ నేపథ్యంలో బ్యాంకులో ఆర్థిక లావాదేవీలను నిలిపేశారు. దీంతో లావాదేవీలు నిర్వహించాల్సిన అవసరం వచ్చిన ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ బ్యాంకు పరిధిలో రెంటపాళ్ల, పాకాలపాడు, గోగులపాడు, పీసపాడు, కట్టమూరు, గోరంట్ల, డీడీ పాలెం గ్రామాలుండగా బ్యాంకులో సుమారు 3 వేల మంది ఖాతాదార్లున్నారు.

దేశ ప్రగతిలో సిఎలది ముఖ్యభూమిక

మాస్టర్‌మైండ్స్ విద్యార్థులతో ఐజి డాక్టర్ త్రివిక్రమవర్మ

ప్రజాశక్తి-గుంటూరు



ఐజిని సన్మానిస్తున్న మట్టుపల్లి మోహన్

సిఎ ఇంటర్ విద్యార్థులకు స్థానిక బ్రాడీపేట, మాస్టర్‌మైండ్స్ రవిభవన్‌లో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి సౌత్‌కోస్టల్ జోన్ ఐజి డాక్టర్ సి.ఎం.త్రివిక్రమవర్మ పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలని, లక్ష్యాన్ని చేరుకోవటానికి తగిన కృషి చేయాలని చెప్పారు. సిఎ కోర్సు పూర్తి చేసిన వారికి అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, దేశ ఆర్థిక ప్రగతిలో సిఎలు కీలక ప్రధాన భూమిక పోషిస్తారని అన్నారు. కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలని, జ్ఞాపకశక్తి పెంచుకోవటానికి, సమయపాలన గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న ప్రముఖ వ్యక్తుల గురించి వివరించారు. మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ తరగతులను ఏకాగ్రతతో వినాలని, చదువుపై ఆసక్తి అలవర్చుకోవాలని చెప్పారు. పరీక్షల్లో ప్రతి ఒక్కరూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఫీజుల కోసం విద్యార్థులకు వేధింపులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు

ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కాలేజి గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు వెళ్లిన విద్యార్థులను కాలేజి ఫీజు మొత్తం రూ.40 వేలు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటాం అని యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని అన్నారు. యాజమాన్యం వ్యవహారశైలితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రైల్వే స్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ గురువారం సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. నూతన రైల్వే స్టేషన్ భవనం నిర్మాణాలను, పశ్చిమ వైపు పనులపై సమీక్షించారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో 8 ప్లాట్ ఫారాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంటనే ఎడిఆర్ఎం ఆర్.రామకృష్ణ, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.ఆంజనేయులు,



పనులనురైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ

డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీరు శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ జె.వి.అనూష ఉన్నారు.

వర్సిటీలో సోలార్ విద్యుత్ ప్లాంట్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2 మెగావాట్ల రూఫ్ టాప్ సోలార్ జనరేషన్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, వర్సిటీ విసి పి.రాజశేఖర్ గురువారం ప్రారంభించారు. ఎన్ఆర్ఇడి క్యాప్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి నిధుల నుండి వీటిని సమకూర్చారని, ఈ ప్రాజెక్టు ద్వారా వర్సిటీలో 70 శాతం విద్యుత్ చార్జీలను ఆదా చేయవచ్చునని వర్సిటీ అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలోనూ ఇలాంటి ప్లాంట్‌ను పెట్టడం వలన విద్యుత్ ఛార్జీలను చాలా వరకు తగ్గించామని చెప్పారు. వీటి ద్వారా వాతావరణ కాలుష్యాన్నీ నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద్‌మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ప్రిన్సిపాల్‌లు చల్లపల్లి స్వరూపరాణి, పి.సిద్ధయ్య, గంగాధర్, ఒఎస్‌డి సునీత, డిఇ ఎన్.వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ మేనేజర్ వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సోలార్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, విసి రాజశేఖర్ తదితరులు

26న గుంటూరులో డాగ్ షో

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు క్లినికల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాగ్ షో నిర్వహిస్తామని గుంటూరు రేంజి డిఐజి, క్లబ్ గౌరవాధ్యక్షులు త్రివిక్రమవర్మ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో నాయన మీడియాతో మాట్లాడారు. వివిధ జాతుల ప్యూర్ బ్రీడ్ డాగ్ పోటీలు జరుగుతాయని, గుంటూరులో తొలిసారి నిర్వహించే ఈ షోకు 275 జాతుల కుక్కలు పాల్గొంటాయని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు డాగ్ ఫ్యాషన్ షో కూడా జరుగుతుందన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా క్లినికల్ క్లబ్ సభ్యులు వ్యవహరిస్తారని అన్నారు. గుంటూరు క్లినికల్ క్లబ్ అధ్యక్షులు పి.రామచంద్రరాజు మాట్లాడుతూ డాగ్ షోలో అనేక రకాల జాతుల కుక్కలను ప్రదర్శిస్తారని, మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే ఈ షోలు ఇప్పటి వరకు జరిగాయని అన్నారు. ఈ సందర్భంగా షో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హిందూ కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌విఎస్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత

సచివాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వాలంటీర్లతో మమేకమై ప్రజలకు సేవలను సమర్థవంతంగా అందించాలని సచివాలయ ఉద్యోగులకు హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత సూచించారు. మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 3వ సచివాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని పాల్గొన్నారు.

మాస్టారు...మాస్టారూ కవర్ సాంగ్ చిత్రీకరణ

ప్రజాశక్తి-తెనాలి



స్థానిక చినరావూరు సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఓ ప్రైవేట్ ఆల్బన్ కవర్ సాంగ్ మాస్టారు...మాస్టారూ చిత్రీకరణను యూనిట్ బృందం చేపట్టింది. దర్శకుడు కనపర్తి రత్నాకర్ పాట చిత్రీకరణకు క్లాప్ కొట్టారు. నిర్మాత ప్రవల్లిక కొండ్రు ది స్ట్రేంజ్ డ్రీమర్స్ బ్యానర్‌పై ఈ పాట చిత్రీకరణను చేపట్టారు. కొరియోగ్రాఫర్ కిరణ్ దర్శకత్వం వహిస్తున్న పాటలో చెర్రి, కావ్య నటిస్తున్నారు. హృతిక్, అల్తాఫ్‌లు డీవోపిలుగా వ్యవహరిస్తున్నారు.